మజ్లిస్ ఎప్పుడూ ప్రజాపక్షమే



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన ఉండే పార్టీ అని ఆ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ఒవైసీ గెలిచిన సందర్భంగా పలువురు మజ్లిస్ నాయకులు టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతుందన్న విషయం అసదుద్దీన్ ఒవైసీ విజయం స్పష్టం చేస్తుందని ఆయన అన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలలోని ఇళ్ల ముంపునకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. దీనికి గాను వివిధ శాఖల బల్దియా అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, సయ్యద్ రఫత్ హుస్సేన్, అబ్బాస్ హుస్సేన్, జహంగీర్‌బేగ్, మహబూబ్ అలీ తదితరులున్నారు.



కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారం చేపడుతున్న సందర్భంగా హైకోర్టులో న్యాయవాదులు సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ, బీజేపీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జనార్దన్ పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

పొంచి ఉన్న ముప్పు..
ఏదీ కనువిప్పు?

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయం



మహమూద్ ఆసుపత్రి వద్ద పోటెత్తిన వరద నీరు (ఫైల్)

నాంపల్లి: వర్షాకాలం వచ్చిందంటే నాంపల్లిలోని పలు లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. చిన్నపాటి వర్షం వచ్చినా ఆ ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నా పరిష్కారం దిశగా చర్యలు శూన్యం. వర్షాలు వచ్చినప్పుడు హడావిడి చేసే అధికార యంత్రాంగం ఆ తర్వాత మిన్నకుండిపోతోంది. సమస్యకు శాశ్వతమైన పరిష్కారం చూపడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి, రెడ్‌హిల్స్, ఆసిఫ్‌నగర్ డివిజన్లు లోతట్టు ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ డివిజన్లలోనే అధికంగా మురికివాడలు ఉన్నాయి.

◆ ఆసిఫ్‌నగర్‌లో ఫిరోజ్‌గాంధీ నగర్ చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తుంది. మోస్తారు వర్షం వచ్చినా ఇక్కడ భారీ స్థాయిలో నీరు నిలిచిపోయి రాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడుతోంది. పరిసరాల్లోని వాణిజ్య దుకాణాల్లోకి వర్షం నీరు, మురుగునీరు కలిసి చేరుతోంది. ఈ బస్తీ మధ్యలో నుంచి వెళ్లే అంతర్గత మురికినీటి నాలా పాడైపోయింది. ఈ నాలా మరమ్మతులు పూర్తికాకపోవడం, శీతల్ హోటల్ దగ్గర కల్వర్ట్ నిర్మాణం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లుల కోసం సమ్మెకు దిగడం, తదనంతరం వరుస ఎన్నికలు రావడం చకచకా జరిగిపోయింది. ఫలితంగా మురికినీటి నాలా పనులు ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్నచందంగా మిగిలిపోయాయి.

◆ అఫ్జల్‌సాగర్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటోంది. ఎగువ భాగాన దేవుని కుంట చెరువు ఉంది. ఈ చెరువు పూర్తిగా అన్యాక్రాంతానికి గురికావడం, చెరువును జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో మాసాబ్‌ట్యాంక్, విజయనగర్ కాలనీ, ఇందిరానగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు లోతట్టు ప్రాంతంలో ఉండే అఫ్జల్‌సాగర్ మునకకు గురవుతోంది. ఇక్కడకు చేరిన మురుగునీరు బయటకు వెళ్లేందుకు తగినంత సామర్థ్యం కలిగిన కాలువలు లేక అక్కడే నిలిచిపోయి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. అన్యాక్రాంతానికి గురైన నాలాల విస్తరణ, నాలాల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగిస్తే తప్పా లోతట్టు ప్రాంతాలను కాపాడే పరిస్థితి కనిపించడం లేదు.

◆ రెడ్‌హిల్స్‌లోని జంగంబస్తీ, రైల్వేస్టేషన్ మీదుగా ప్రవహిస్తూ ఆండాలమ్మ బస్తీకి చేరుకునే నాలా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే నాంపల్లి రైల్వేస్టేషన్ పక్కన ఉండే ఆండాలమ్మ బస్తీ, టిప్పుఖాన్ సరాయి నీట మునుగుతున్నాయి. టిప్పుఖాన్ సరాయి మురికివాడలోని నాలా పూర్తిగా అన్యాక్రాంతం అయ్యింది. ఈ నాలాను అభివృద్ధి చేయాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి నాంపల్లి రైల్వే క్వార్టర్స్ వద్ద డైవర్షన్ పైప్‌లైన్ ద్వారా మురుగునీటి నాలాను మళ్లించారు. ఈ డైవర్షన్ ఎగువ ప్రాంతంలో ఉండటంతో వర్షం నీరు సులభంగా లోతట్టుకు వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. అధికారులు, రాజకీయ నేతలు కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం మురుగునీటి నాలాను స్లోప్‌కు విరుద్ధంగా మళ్లించారని స్థానికులు గుస్సా చేస్తున్నారు.

◆ ఆసిఫ్‌నగర్ కుమ్మర్‌వాడిలోని ప్రధాన వీధులు వర్షం వచ్చిందంటే ముంపునకు గురవుతున్నాయి. దత్తాత్రేయనగర్, బైలక్ ఆసిఫ్‌నగర్ ప్రాంతాలపై భాగం ఉంచి వచ్చే వర్షం నీటితో పాటు మురుగు రోడ్లపై నిలిచిపోతోంది. ఈ వర్షం నీరు కింది భాగానికి వెళ్లేందుకు సరైన పైప్‌లైన్ నిర్మాణం జరుగలేదు. ఫలితంగా పాత మల్లేపల్లిలోని హరిజనవాడను వరద నీరు ముంచెత్తుతోంది. కాబట్టి కుమ్మర్‌వాడి లోధ్‌బస్తీ చౌరస్తాలో వర్షపు నీరు వెళ్లేలా మురుగునీరు వెళ్లేందుకు పైప్‌లైన్ వ్యవస్థను మెరుగుపరిస్తే పరిష్కారం లభిస్తుంది.



అఫ్జల్‌సాగర్‌లో ఇంట్లోలోకి చేరుకున్న వర్షపు నీరు (ఫైల్)

ప్రజా సంక్షేమమే లక్ష్యం



ఈటలను సన్మానిస్తున్న రక్షిత్‌రాచకొండ తదితరులు

గోల్కొండ: ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్ అన్నారు. ఎంపీగా గెలుపొందిన ఆయనను బీజేపీ నాయకుడు రక్షిత్ రాచకొండ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఈటల రాజేందర్‌కు పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా ఎంపికై రికార్డులు సృష్టిస్తున్నారన్నారు. ఆయన పాలన తీరుకు తన విజయం అద్దం పడుతుందని ఆయన పేర్కొన్నారు. వర్గాలు, వయస్సుకు సంబంధం లేకుండా తనను ఓటర్లు గెలిపించారని వారికి తాను ఎప్పుడు రుణపడి ఉంటానని ఆయన అన్నారు.

పబ్లిక్ నల్లా జాగా కబ్జా..!



గోల్కొండ బడాబజార్‌లోని పబ్లిక్ నల్లా వద్ద చెత్త

గోల్కొండ: బడాబజార్‌లోని పబ్లిక్ నల్లా జాగాను కబ్జా చేయడానికి కొందరు కుట్రలు పన్నుతున్నారు. ప్రజల నీటి అవసరాలకు దశాబ్దాల క్రితం గోల్కొండ బడాబజార్ పోస్టు ఆఫీస్‌కు ఎదురుగా ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వం ఒక పబ్లిక్ నల్లా ఏర్పాటు చేసింది. ఆ నల్లా చుట్టూ ఇటుక, సిమెంట్‌తో ప్రహరీని కూడా నిర్మించింది. దాని పక్కనే ఓ పబ్లిక్ బోరు కూడా వేశారు. ఈ పబ్లిక్ నల్లా, బోరు నుంచి గోల్కొండ బడాబజార్, ఖాజీగల్లీ తదితర ప్రాంతాలకు చెందిన ఎన్నో కుటుంబాలు నీటిని తీసుకునేవి. అయితే కొందరు ఈ నల్లా జాగాపై కన్నేశారు. పబ్లిక్ నల్లా వద్దకు ఎవరూ రాకుండా వ్యర్థాలను, చెత్తను డంపింగ్ చేస్తున్నారు. పబ్లిక్ నల్లా వద్ద చెత్త డంపింగ్ జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా పబ్లిక్ నల్లా పక్కనే ఉన్న చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

కార్మిక సంఘాలు బలోపేతం కావాలి



గన్‌ఫౌండ్రీ: కార్మిక సంఘాలు బలోపేతం కావాలని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. బుధవారం గన్‌ఫౌండ్రీలోని పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వాల హయాంలో సాధించుకున్న కార్మికుల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు. కేంద్ర మాజీ మంత్రులు సర్వే సత్యనారాయణ, ఎస్.వేణుగోపాలచార్యులు మాట్లాడుతూ.. బీజేపీ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని వాటిని తిరిగి సాధించుకునేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో కార్మికుల ఉద్యోగాలు, హక్కులు ప్రమాదంలో పడ్డాయని వాటిని ఎదుర్కోవడానికి కొత్త దిశా నిర్దేశం చేయాలన్నారు. అనంతరం అంబటి కృష్ణమూర్తి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతీయ కార్మిక సంఘాల సమైక్య అధ్యక్షులు గొల్లపల్లి దయానంద్, ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌బాబు, కార్యదర్శి ఎస్.నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నాంపల్లి: తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన హైదరాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చినట్లు తెలిపారు. ప్రయాణికుడి జేబులో ఖాజీపేట నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వరకు ప్రయాణించడానికి తీసుకున్న జనరల్ రైలు టికెట్ ఉన్నట్లు తెలిపారు. ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి ఒంటిపై ఎరు రంగు టీ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు



మొక్కలు నాటుతున్న రాజేష్ కుమార్ తదితరులు



పర్యావరణంపై చేపట్టిన అవగాహన ర్యాలీ

నాంపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సామాజిక కార్యకర్త మహ్మద్ అబిద్ అలీ పేర్కొన్నారు. బుధవారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరిగాయి. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు హాజరైన మహ్మద్ అబిద్ అలీ మాట్లాడుతూ..నగరంలోనే ఎంతో ఖ్యాతిగడించిన పబ్లిక్‌గార్డెన్స్‌ను కాపాడుకోవాలని కోరారు. గార్డెన్స్‌లో సుందరీకరణ పనులతో పాటుగా మొక్కలు నాటాలని సూచించారు. అలాగే చారిత్రక వారసత్వ కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు ఎంతో ఆహ్లాదకరంగా ఉండే పబ్లిక్‌గార్డెన్ పూర్తిగా కాలుష్యకారకంగా తయారయ్యిందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చే వాకర్స్ ఇతరత్రా పార్కులకు వెళ్లిపోతున్నట్లు వివరించారు. కాబట్టి వాకర్స్‌కు అనుకూలమైన వాతావరణాన్ని కలిగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు సింగరేణి ఉద్యోగులు ప్రతిజ్ఞ..

ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలను సింగరేణి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ జి.దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడటానికి మూడు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా అందరూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఏజీఎంలు ఎస్.వి.రాజశేఖరరావు, చక్రవర్తి, చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..

యాకుత్‌పురా: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి సమీపంలో మొక్కలు నాటాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ పారిశుద్ధ్య విభాగం డిప్యూటీ కమిషనర్ రాజేష్‌కుమార్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం దారుషిఫాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలుష్యాని నివారించేందుకు చెట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం. రాజేష్‌యాదవ్, సభ్యులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు

అబిడ్స్ లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో..



మొక్కలు నాటిన రేవ్‌బ్రదర్ షజాన్ ఆంటోని, అంజన్‌కుమార్ యాదవ్, గౌరీ సతీష్, ధన్‌రాజ్

అబిడ్స్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్‌లు పేర్కొన్నారు. అబిడ్స్ లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్స వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రేవ్‌బ్రదర్ షజాన్ ఆంథోని ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న అంజన్‌కుమార్ యాదవ్, గౌరీ సతీష్ మొక్కలు నాటి ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ఉందన్నారు. ప్రిన్సిపాల్ రేవ్‌బ్రదర్ షజాన్ ఆంథోని మాట్లాడుతూ..తమ విద్యార్థులకు పర్యావరణంపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ మాజీ డైరెక్టర్ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి



ఎంపీ మల్లు రవిని సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 5 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిచిన డాక్టర్ మల్లు రవిని పోల్కం శ్రీనివాస్ ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..మేరు కులస్తులంతా లక్షలాది మంది కాంగ్రెస్ గెలుపునకు ఎంతో కృషి చేశారన్నారు. అన్నివర్గాల ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, నవీన్‌కుమార్, వెన్ను శివకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌గుప్తాకు సర్వీస్ ఐకాన్ అవార్డు ప్రదానం



దామోదర్‌గుప్తాకు అవార్డును అందజేస్తున్న ఆమని తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తాకు సర్వీస్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. బుధవారం శృతిలయ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళాకారులకు సహాయ సహకారాలు అందించేందుకు చివరి వరకు కృషి చేస్తానని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతలను పెంచిందని, అవార్డును ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కృష్ణ బోగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



గుడిమల్కాపూర్‌లో బీజేపీ సంబరాలు



కోమటివాడిలో..

గోల్కొండ: దేశంలో బీజేపీకి తిరుగులేదన్న విషయం మరోసారి ప్రజాతీర్పు స్పష్టం చేసిందని ఆ పార్టీ నాయకుడు దేవర వంశీ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల విజయవంత పాలనకు ఈసారి ఎన్నికల్లో ప్రజలు అంగీకరించారని అందువల్లే అన్ని రాష్ట్రాలలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారన్నారు. అన్ని వయస్సుల వారు మెచ్చేలా ప్రధాని మోదీ దేశానికి దిశానిర్దేశం చేశారన్నారు. నామా యాదగిరి, ప్రభు పూజారి, అశ్విన్ మోదీ తదితరులున్నారు.

భారత నవయుగ సమాజ్ ఆధ్వర్యంలో..

దబీర్‌పురా: కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో బుధవారం దబీర్‌పురా కోమటివాడిలో భారత నవయుగ సమాజ్ ఆధ్వర్యంలో సభ్యులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు మిఠాయిలు పంచి పెట్టుకొని సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ ప్రతినిధులు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

భారీవర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



బీబీబజార్ చౌరస్తాలో చెరువును తలపిస్తున్న ప్రధాన రోడ్డు

చార్మినార్: పాతబస్తీలో ఎప్పుడు వర్షాలు కురిసినా లోతట్టు రోడ్లలో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. బుధవారం కురిసిన భారీ వర్షానికి పాతబస్తీలోని లోతట్టు రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ముఖ్యంగా బీబీబజార్ చౌరస్తాలోని నలువైపులా వరదనీరు రోడ్డుపై నిలిచిపోవడంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగించిన వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. వరదనీటిలో ద్విచక్రవాహనాలు మునిగిపోయి..ముందుకు వెళ్ల లేక మొరాయించాయి. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నిలిచిపోతున్న వరదనీరు మురుగునీటి కాల్వలతో పాటు డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లోకి వెళ్లేటట్లు వెంటనే తగిన చర్యలు తీసుకుని వాహనదారులకు కలుగుతున్న వరదనీటి కష్టాలను దూరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

యాకుత్‌పురాలో..

యాకుత్‌పురా: యాకుత్‌పురాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. యాకుత్‌పురా రైల్వే స్టేషన్, జఫర్ రోడ్డు, యత్రఫ్ నగర్, మదీనానగర్, దోభిఘాట్, తలాబ్‌కట్టా, నషేమన్‌నగర్, చాచాగ్యారేజ్, మొఘల్‌పురా, బీబీ బజార్ చౌరస్తా, బడాబజార్, ఎస్‌ఆర్టీ కాలనీ, రెయిన్‌బజార్, ముర్తుజానగర్, సరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



తలాబ్‌కట్టాలో..

చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో బుధవారం కురిసిన భారీ వర్షంతో ముంపు బస్తీలలో వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం 5 గంటల నుంచి ఏకధాటిగా కురిసిన వర్షంతో ఉప్పుగూడలోని సాయిబాబానగర్, శివాజీనగర్‌లలో ఇళ్లల్లోకి నీరు చేరింది. పూర్తి స్థాయిలో నాలా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన వరద ఈ బస్తీలను ముంచెత్తింది. ఛత్రినాక చౌరస్తా, బండ్లగూడ చౌరస్తాలలో కూడా నీరు రోడ్లపై పెద్ద ఎత్తున ప్రవహించంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు.



ఉప్పుగూడలో..